క్లుప్తంగా

భూముల రీసర్వేను వేగవంతం చేయండి



భూముల రీసర్వేపై ఆరాతీస్తున్న డీటీ సుందరరావు

వంగర: భూముల రీసర్వేను వేగవంతం చేయండి అని డీటీ బూరాడ సుందరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని ఇరువాడ, కోనంగిపాడు, కింజంగి గ్రామాల్లో పర్యటించిన ఆయన అక్కడి సచివాలయాల్లో భూముల రీసర్వే వివరాలు, రికార్డులను పరిశీలించారు. రైతుల సమక్షంలోనే సర్వే, హద్దు రాళ్ల ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయన వెంట మండల సర్వేయర్ వై.అప్పలనాయుడు ఉన్నారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు

రేగిడి: నకిలీ పురుగుమందులు, విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బూరాడ, పనసలవలస గ్రామాల్లోని ఫెర్టిలైజర్స్ షాపుల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయా షాపుల్లో పురుగుమందులు, ఎరువుల నిల్వలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అధికారుల సూచనల మేరకు విక్రయాలు చేపట్టాలని, రైతులను మోసగించినట్లు తెలిస్తే ఊరుకునేది లేదన్నారు.

రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



అమరాంలో కొత్తగా వేసిన సీసీ రోడ్డు

రాజాం: మండలంలోని ఆగూరు పంచాయతీ, అమరాం గ్రామంలో రూ.4 లక్షల అంచనా వ్యయంతో కొత్తగా సీసీ రోడ్డు నిర్మించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతీ సచివాలయం పరిధిలో పలు అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరు కాగా, వీటిలో రూ.4 లక్షల వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ కోనారి అప్పారావు తెలిపారు.

ఇది ప్రభుత్వ స్థలం.. ఆక్రమిస్తే శిక్షార్హులు..



ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

బొబ్బిలి: స్థానిక పట్టణ పరిధిలోని మిలటరీ కాలనీలో కొంతమంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. అక్కడి స్థలం చదును చేస్తున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ డోల రాజేశ్వరరావు తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి, వారిని హెచ్చరించారు. ఇది ప్రభుత్వ స్థలమని, దీనిని ఎవరైనా ఆక్రమిస్తే శిక్షార్హులని బోర్డు ఏర్పాటు చేశారు.

గ్యాస్ సిలిండర్ల స్వాధీనం



గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మల్లంపేటకు వెళ్లే దారిలోని గణేష్ హోటల్‌లో వంటకు వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లను రెవెన్యూ శాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గృహావసరాలకు ప్రభుత్వం సరఫరా చేసిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు హెచ్చరించారు. మొత్తం 4 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ, ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్‌ఓ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ

తెర్లాం: స్థానిక రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం రాగిజావ పంపిణీ చేశారు. ఎంఈఓ జె.త్రినాథరావు పాఠశాలను సందర్శించి, రాగిజావను రుచి చూశారు. రుచికరంగా ఉంటేనే పిల్లలు రాగిజావను ఇష్టపడతారని, మెనూ ప్రకారం దీనిని క్రమం తప్పకుండా అందించాలని సూచించారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలి

తెర్లాం: ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పనులు జరిగిన వెంటనే వేతనదారులకు బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. నిర్దేశిత కొలతల్లో పనిచేయించి, రోజుకు రూ.257 వేతనం వచ్చేలా చూడాలన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



సంతకవిటి: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామారాయపురం గ్రామానికి శుక్రవారం విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. సీఎం జగన్ తన పాదయాత్ర మొదలుకుని, ప్రజాసంకల్ప యాత్ర వరకు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. గ్రామ సచివాలయాలతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఇంతవరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ప్రజలకు ఇంత మంచి చేస్తున్న ప్రభుత్వంపై టీడీపీ అండ్ కో పనిగట్టుకుని మరీ లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇదే గ్రామానికి చెంది, పదో తరగతి ఫలితాల్లో 582 మార్కులు సాధించిన పైడి శ్వేతను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, స్థానిక నాయకులు వై.శ్రీను, ఎంపీటీసీ ఎం.కృష్ణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మరోసారి మోసం చేసేందుకే టీడీపీ బస్సుయాత్ర



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకే టీడీపీ బస్సుయాత్ర చేపడుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. స్థానిక పట్టణంలోని విలేకరులతో శుక్రవారం మాట్లాడిన ఆయన చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా పనిచేసి, ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. కులం, మతం, పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. గతంలో బాబు వస్తే జాబు వస్తుందని అధికారంలోకి వచ్చిన వారు ఎంతమందికి జాబులు ఇచ్చారని నిలదీశారు. యువతకు జాబులు ఇవ్వకపోయినా ఆయన కొడుకు లోకేష్‌కు మాత్రం మినిస్టర్ జాబు ఇచ్చారని ఎద్దేవాచేశారు. మోసపూరిత హామీలతో 2014లో గెలిచారని, అప్పుడు ఇచ్చిన హామీలు ఇవ్వకపోవడంతోనే 2019 ఎన్నికల్లో ప్రజలు ఓడించి, బుద్ధి చెప్పారన్నారు. మరోసారి టీడీపీని నమ్మి మోసపోవద్దని ప్రజలకు హితవుపలికారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, వైస్ ఎంపీపీ పి.పాపారావు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



బొబ్బిలి: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజాం: స్థానిక పట్టణంలోని మాదిగ వీధిలో ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు కేక్ కట్ చేసి, పలువురికి పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మందకృష్ణ మాదిగ సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారని, ఆయన పోరాట ఫలితంగానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు నారాయణరావు, ఆనందరావు మాస్టారు, రాజు మాస్టారు, యేసురత్నం, సూరిబాబు, జయరాం, రవి, చినబాబు, జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేతలంతా రాయగడ రోడ్డులోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావానికి గల కారణాలను వక్తలు వివరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణరావు, జి.రమేష్, పి.శంకరరావు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని గ్రామగ్రామాన ఓ యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, అవి వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. శుక్రవారం పలువురి ఇళ్ల వద్దకే వెళ్లి, జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువపత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా ఉచితంగా అందజేశారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సంతకవిటి: ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



బొబ్బిలి: ధ్రువపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు



రాజాం: రాజయ్యపేటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు



మెంటాడ: ఆగూరులో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న సిబ్బంది



రేగిడి: చాటాయివలసలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీడీఓ నాగమణి

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు సద్వినియోగం చేసుకోండి



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: ఇంటింటికీ వైద్యసేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సేవలు సద్వినియోగం చేసుకోండి అని ఎంపీడీఓ బాసూరి శంకరరావు కోరారు. శుక్రవారం మండలంలోని గడిముడిదాం గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి సిద్ధేశ్వరి రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యంగా ఉండాలని ఎంపీడీఓ కోరారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, వాటి బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



చిరుధాన్యాలు సాగుకు రైతులను సన్నద్ధం చేస్తున్న మండల వ్యవసాయధికారిణి శిరీష

బాడంగి: మండలంలోని వాడాడ గ్రామ రైతు భరోసా కేంద్రంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారిణి కె.శిరీష మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు వస్తాయని, వీటిని సాగు చేసేందుకు ఆసక్తి కనబరచాలని రైతులను కోరారు. ప్రధాన పంటలో అంతరపంటలుగా రాగులు, కొర్రలు, కందులు, పంటలు పండించాలని తెలిపారు. అనంతరం దాదాపు 4 ఎకరాల్లో రైతులతో చిరుధాన్యాల సాగు చేపట్టించారు. మెట్టుభూముల్లో వీటిని సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, లాభాలు వస్తాయన్నారు. విత్తనాలు, ఎరువులను కూడా ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తోందన్నారు. కార్యక్రమంలో వీఏఏ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



తెర్లాం నాన్ భవిత కేంద్రంలో విద్యార్థుల చదువును పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: దివ్యాంగ విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఎంఈఓ త్రినాథరావు సూచించారు. స్థానిక పట్టణంలోని నాన్ భవిత కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన ఎంతమంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారు.. కేంద్రానికి ఎంతమంది పిల్లలు వస్తున్నారన్న దానిపై ఐఈఆర్‌టీ సూర్యారావు, ప్రసాదరావును ఆరాతీశారు. కేంద్రానికి వచ్చే విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను సులభమైన పద్ధతిలో బోధించాలని, అలాగే గృహాలకే పరిమితమైన పిల్లల వద్దకు మీరే వెళ్లి, విద్యాబోధన చేయాలని తెలిపారు.

లక్షల్లో ఇళ్లు.. వేలల్లో ఊళ్లు..

- 'హౌసింగ్ డే'లో మండల ప్రత్యేకాధికారి గోవిందరావు



రామభద్రపురం: ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న మండల ప్రత్యేకాధికారి గోవిందరావు



వంగర: గృహ నిర్మాణాల పరిశీలనలో ఎంపీడీఓ శ్రీనివాసరావు



బాడంగి: ఆకులకట్టలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు



బొబ్బిలి: దిబ్బగుడివలసలో హౌసింగ్ డేలో అధికారులు

రామభద్రపురం: రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో ఇళ్లు, వేలల్లో ఊళ్లు నిర్మించి, పేదలకు ప్రభుత్వం ఇస్తోందని మండల ప్రత్యేకాధికారి గోవిందరావు అన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తారాపురం గ్రామంలో తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ రమామణితో కలిసి పర్యటించిన ఆయన అక్కడి జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించి, నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులను కోరారు. ఇప్పటికే జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందని, త్వరలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మరికొద్ది రోజుల్లో సామూహిక గృహప్రవేశాలు జరగనున్నాయని, మండలంలోని ప్రతీ ఒక్క లబ్ధిదారుడు నిర్మాణాలను సిద్ధం చేసుకోవాలని కోరారు.

వంగర: మండలంలోని కోనంగిపాడు, ఇరువాడ, కింజంగి గ్రామాల్లోని జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తోందని, అవసరమైన వారికి నిర్మాణ సామగ్రి అందిస్తోందని లబ్ధిదారులకు తెలిపారు. ప్రతీ లబ్ధిదారు తమ నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పైడితల్లి పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని ఆకులకట్ట గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించి, జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణాలపై ఎంపీడీఓ అంజనేయులు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ సామూహిక గృహ ప్రవేశాలకు సన్నాహాలు చేస్తోందని, నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. నిర్మాణానికి అవసరమైన రుణం, నిర్మాణ సామగ్రి ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ఇళ్లు పూర్తి చేసిన వారికి బిల్లులు కూడా అందిస్తోందన్నారు. హౌసింగ్ డీఈఈ అప్పయ్య, ఏఈ సత్యం, ఏపీఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బొబ్బిలి: హౌసింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిబ్బగుడివలస గ్రామంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ పి.రవికుమార్, హౌసింగ్ ఏఈ ఎ.సూర్యనారాయణ కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు నిర్మాణాలు ప్రారంభించాలని లబ్ధిదారులను కోరారు. అనంతరం పిరిడి జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం వంటకాలు విద్యార్థులకు వండిపెట్టాలని సూచించారు.

పోయిన ఫోన్ అప్పగింత

రాజాం సిటీ: స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. బొబ్బిలికి చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ సీహెచ్ శ్రీనివాసరావు రాజాంలోని ఓ మెడికల్ షాపు వద్దకు వచ్చాడు. తన ఫోన్‌ను పక్కనబెట్టి షాపు యజమానితో మాట్లాడుతున్న సమయంలో అక్కడున్న ఫోన్ మాయమైంది. విషయం గమనించిన అతడు అక్కడే విధుల్లో ఉన్న ఎస్ఐ పి.నీలావతికి ఫోన్ పోయిన విషయం తెలిపాడు. అప్రమత్తమైన ఎస్ఐ దగ్గరలోని సీసీ ఫుటేజీ పరిశీలించి, ఫోన్ దొంగిలించిన వ్యక్తి కాంప్లెక్స్ వైపు వెళ్తున్నట్లు గుర్తించి, పట్టుకున్నారు. అనంతరం అతడి దగ్గర నుంచి ఫోన్ తీసుకుని, బాధితునికి అందజేశారు.

సంక్షిప్తంగా...

బాధ్యతల స్వీకరణ

వంగర: ఇన్‌చార్జ్ ఎంఈఓ(మండల విద్యాశాఖాధికారి)–1గా పి.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాడంగి: మండల విద్యాశాఖాధికారిగా పి.లక్ష్మణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు ఎం.డోలపేటలో గడప గడపకు..

రేగిడి: మండలంలోని ఎం.డోలపేట, పాతచెలికానివలస గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి నేతలు, అధికారులంతా హాజరు కావాలని వారు కోరారు.

పెరటికోళ్ల పెంపకంతో మహిళలకు ఉపాధి

బాడంగి: పెరటికోళ్ల పెంపకంతో మహిళలకు ఉపాధి కలుగుతుందని ఏపీఎం భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో 30 మంది డ్వాక్రా గ్రూపు మహిళలకు 11 కోడిపిల్లలు(3 పుంజులు, 8 పెట్టపిల్లలు) చొప్పున శుక్రవారం పంపిణీ చేశారు. వీటిని రాయితీపై కేవలం రూ.3,970కే అందజేసినట్లు ఏపీఎం పేర్కొన్నారు. ఇంటి వద్దనే వీటిని పెంచుకుని, అమ్ముకోవడం ద్వారా జీవనోపాధి మెరుగుపరుచుకోవచ్చని ఆమె తెలిపారు.

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు

రేగిడి: మండలంలోని రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే)కు యూరియా, డీఏపీ వంటి ఎరువులు శుక్రవారం చేరుకున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల వద్ద ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి. మురళీకృష్ణ కోరారు.

నేడు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొనే ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందరరావు కోరారు. ఇదిలా ఉండగా, పట్టణంలోని పిరిడికి వెళ్లే దారిలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి ప్రజాప్రతినిధులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజాం సిటీ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ ఎస్ఐ పిచ్చేశ్వరరావు స్థానిక సీతారామ థియేటర్ వద్ద శుక్రవారం పట్టుకున్నారు. రేగిడి గ్రామ సమీపంలోని నాగావళి నది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు అందుకున్న సమాచారంతో ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. ఎస్ఈబీ ఎస్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అపహరణపై కేసు నమోదు

రాజాం సిటీ: మండలంలోని లక్ష్మీపురానికి చెందిన తాడ్డి మోహన్‌బాబు తన ద్విచక్రవాహనం అపహరణకు గురైందని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 4వ తేదీన జీఎంఆర్ కేర్‌కు ఎక్స్‌రే నిమిత్తం వెళ్లి, పార్కింగ్‌లో వాహనం ఉంచాడు. ఎక్స్‌రే తీసుకున్న తర్వాత బయటకు వచ్చి, చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో వెతికారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో బాధితుడిఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు.

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు

రాజాం సిటీ: బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేసుకుంటే పంట తెగుళ్ల బారిన పడకుండా ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీ పి.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని పొగిరి గ్రామంలో బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేస్తే ఆశించిన దిగుబడులు పొందవచ్చన్నారు.